ప్రజాశక్తి

శుక్రవారం 17 మే 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

జలమయమైన ఒంగోలులోని కర్నూలురోడ్డు..

ఒంగోలులో భారీ వర్షం

- చెరువులను తలపించిన ప్రధాన రోడ్లు
- ట్రాఫిక్‌కు ఇబ్బందులు
- వర్షంతో సేదతీరిన ప్రజలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఓ వైపు వేసవి తాపం, మరో వైపు ఎన్నికల వేడితో సతమతమైన ఒంగోలు నగర ప్రజలను భారీ వర్షం సేద తీర్చింది. రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి ఒంగోలు నగరంలోని ప్రధాన మార్గాలు జలమయమయ్యాయి. ఒంగోలులోని కర్నూల్ రోడ్డు చెరువును తలపించింది. వర్షపు నీరు రోడ్ల పైకి చేరటంతో వాహనాదారులు నానా ఇబ్బందులు పడ్డారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది కాల్వలలో పూడికను తొలగించటంతో వర్షపునీరు బయటకు పోయింది. ఒంగోలు నగరంతో పాటు పలు గ్రామాలలో వర్షం కురియటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు నగరంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలు, అల్ప పీడన ప్రభావంతో భారీ వర్షం కురియటంతో ఒంగోలు నగర ప్రజలు ఉపశమనం పొందారు. గత 20 రోజులు వేసవి తాపంతో నగర ప్రజలు అల్లాడి పోయారు. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికల వేడి తోడు కావటంతో ప్రజల బాధలు వర్ణనాతీతం. గురువారం ఉదయం కురిసిన వర్షానికి ప్రజలు సేదతీరారు. ఒంగోలు నగరంలోని ప్రధాన మార్గాలు జలమయ మయ్యాయి. ఒంగోలు కర్నూలు రోడ్డుతో పాటు అద్దంకి బస్టాండ్, మస్తాన్ దర్గా, మిరియాలపాలెం, ధారావారితోట, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, లాయర్‌పేట, ఆర్టీసి బస్టాండ్ తదితర ప్రాంతాలలో మురుగునీటి కాల్వలు పొంగిపొర్లాయి. ▶ 2లో

కూడికలు..తీసివేతలు..

- పోలింగుపై అభ్యర్థుల ఉత్కంఠ విశ్లేషణలు
- ఒంగోలులో గెలుపుపై ఇద్దరిలోనూ గట్టి ధీమా
- తెరచాటున జోరుగా బెట్టింగులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అభ్యర్థులు ఇప్పుడు బూతుల వారీగా తమకు ఎన్ని ఓట్లు పడ్డాయి? ఎక్కడ ప్లస్.. ఎక్కడ మైనస్ అనే లెక్కలపై నిమగ్నమై ఉన్నారు. రెండు రోజులుగా గ్రామాల నుంచి నేతలను పిలిపించి పార్టీ క్యాంపు ఆఫీసుల్లో ఇదే తరహా విశ్లేషణలు చేస్తున్నారు. కూడికలు..తీసివేతలు నడుస్తున్నాయి. వాటి ఆధారంగా ఎంత మెజార్టీతో గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. అందరూ గెలుస్తామనే చెబుతున్నారు. పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎవరికివారే గెలుపుపై ధీమాతో ఉన్నారు. కాంగ్రెసు, స్వతంత్రులను మినహాయిస్తే అసెంబ్లీ స్థానాలకు తెలుగుదేశం, వైసిపి నుంచి నియోజకవర్గానికి ఇద్దరు పోటీలో ఉన్నారు. ఇద్దరూ గెలుస్తామని చెబుతున్నారు. వాస్తవానికి జిల్లాలో గెలిచేది ఏ పార్టీ నుంచైనా 8 మంది ఎమ్మెల్యేలే.. ఇప్పటికే పోలింగ్ సరళిని బట్టి అంచనాల్లో ఉన్నారు. కొన్ని చోట్ల పార్టీలకు ఉన్న పట్టురీత్యా ఎవరిది గెలుపు అనేది తేలిపోయింది. కొన్నిచోట్ల గట్టిపోటీ ఉంది. నాలుగైదు వేలతో గెలుస్తామని చెబుతున్న నియోజకవర్గాల్లో మాత్రం పరిస్థితి ఉత్కంఠగానే మారింది. ఇలాంటి చోట్ల ఆఖరు నిమిషం వరకూ ఏం జరుగుతుందో అంతుచిక్కని పరిస్థితి ఉంటుంది. ఒంగోలు, దర్శి కొండపి నియోజకవర్గాల్లోనే ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు జరిగాయి. ఇక్కడ గెలుపు కోసం ఇద్దరూ పోరాడారు. అన్ని కోణాల్లో చివరి నిమిషం వరకూ ఓట్ల కోసం గట్టి ప్రయత్నాలు చేశారు. దర్శిలో 90 శాతంపైగా పోలింగు జరగడం విశేషం. ఇక్కడ వైసిపి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గట్టి ధీమాలో ఉన్నారు. ఐదారు వేలతోనైనా బయటపడతామనే భావనలో ఉన్నారు. తాళ్లూరు మండలంపైనే ఆయన ఆశలు పెట్టుకున్నారు. తెలుగుదేశం నుంచి పోటీలో ఉన్న గొట్టిపాటి లక్ష్మి కూడా అన్ని విధాలా పోరాడారు. ఆమె ▶ 2లో

ఆనందబాబు గృహనిర్బంధం

నోటీసులు జారీ

ప్రజాశక్తి-వేమూరు

తెలుగుదేశం పార్టీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబును పోలీసులు బుధవారం రాత్రి ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఎన్నికలను పురస్కరించుకొని మాచర్లలో జరుగుతున్న హింసకాండపై బుధవారం మాచర్ల వెళ్లేందుకు టిడిపి నేతలు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మాచర్ల వెళ్లేందుకు సిద్ధపడటంతో ముందుగా సమాచారం తెలుసుకున్న పోలీసులు రాత్రికి రాత్రి ఆనందబాబును ▶ 2లో

నోటీసు అందుకుంటున్న ఆనందబాబు

ఆస్తి కోసం..
అంత్యక్రియలు అడ్డగింత

- ఆస్తి తమకే కావాలంటున్న దాయాదులు
- అంతక్రియలు తామే చేస్తామంటున్న భార్య, పిల్లలు
- మూడు రోజులుగా మృతదేహం అక్కడే..

ప్రజాశక్తి-మర్రిపూడి

ఓ వ్యక్తి బతికుండగానే అతని ఆస్తి మీద కన్నేసిన దాయాదులు చనిపోయిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకుంటున్న ఘటన మండలంలోని అయ్యప్పరాజు పాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుట్లపల్లి వెంకటేశ్వర్లు (75) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. భర్త మరణ వార్త తెలిసిన భార్య రమణమ్మ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలను మృతుడి సోదరుడి పిల్లలు అడ్డుకుంటున్నారు. మృతుడు వెంకటేశ్వర్లుకి భార్య రవణమ్మ, అరుణ, భారతి, శారద ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె భారతికి కందుకూరుకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. మిగిలిన ఇద్దరు కుమార్తెలను అదే ఊర్లో వివాహం జరిపించారు. వెంకటేశ్వర్లు బతికున్న సమయంలోనే భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా కొన్ని సంవత్సరాలుగా దూరంగా ఉంటున్నారు. క్యాన్సర్ బారిన పడిన భార్య రమణమ్మ గ్రామంలోనే ఉన్న ఒక కుమార్తె దగ్గర ఉంటోంది. మృతుడు వెంకటేశ్వర్లు తన అన్నదమ్ములు.. వారి పిల్లల దగ్గర ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ సమయంలోనే వెంకటేశ్వర్లు చెందిన ఆస్తిని అన్నదమ్ముల పిల్లలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భర్త నుండి దూరంగా ఉంటున్న భార్య, కుమార్తెలు ఆస్తికోసం ఈ రిజిస్ట్రేషన్ కంటే ముందుగానే కోర్టులో దావా వేశారు. వ్యవహారం కోర్టులో ఉండగానే రిజిస్ట్రేషన్ చేయడం.. దానికి అధికార పార్టీ నాయకులు కొందరు వత్తాసు పలికినట్లు ఆరోపణలు న్నాయి. ఈ క్రమంలో మరణించిన వెంకటేశ్వర్లు అంత్యక్రియలు నిర్వహించే విషయంపై అటు భార్యాపిల్లలు, ఇటు అన్నదమ్ముల కుమారులు గొడవ పడుతున్నారు. చాలా సంవత్సరాలుగా వెంకటేశ్వర్లు తమ వద్ద ఉంటూ ఆలనాపాలనా చూశామని, తమకే ఆస్తి చెందుతుందని, మతదేహానికి అంత్యక్రియలు నిర్వహించే అర్హత భార్యాపిల్లలకు లేదంటూ ఆస్తి పేరుతో అన్నదమ్ముల పిల్లలు అడ్డు తగులుతున్నారు. వెంకటేశ్వర్లు నుండి విడాకులు తీసుకోకుండా దూరంగా ఉంటున్న భార్య, వారి పిల్లల వ్యవహారం కోర్టులో ఉండగా.. గతంలో అధికార వైసీపీ ఇన్చార్జిగా ఉన్న వ్యక్తి సహకారంతో ▶ 2లో

వెంకటేశ్వర్లు మృతదేహం



కూడికలు..తీసివేతలు..

(మొదటిపేజీ తరువాయి)

కూడా గెలుపుపై పూర్తి ధీమాతోనే ఉన్నారు. ఏదేమైనా ఇక్కడ ఉత్కంఠగానే అంచనాలు కొనసాగుతున్నాయి. రెండు శిబిరాల్లోనూ గట్టిపోటీ ఉందనే చర్చ ఉన్నా గెలుపుపై ఇద్దరూ ధీమాలో ఉన్నారు. ఒంగోలులోనూ ఇదే పరిస్థితి. మాజీ మంత్రి బాలినేని, మాజీ ఎమ్మెల్యే దామచర్ల ఇద్దరూ గట్టిగానే గెలుస్తామని పార్టీ శ్రేణులకు చెబుతున్నారు. బూతుల వారీగానూ ప్రాంతాల వారీగా పోలింగు వివరాలను తీసుకొని లెక్కలు వేసుకుంటున్నారు. పందెంలు జోరుగా సాగాయి. ఎవరి ధీమాలో వాళ్లున్నారు. ఇక్కడే బెట్టింగులు కూడా తెరచాటు నడుస్తున్నాయి. అయితే ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీనే అనే చర్చ కూడా ఉంది. దీంతో ఒంగోలులో గెలుపు, ఓటములపై అంత తొందరపడి బెట్టింగులు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదనే చెబుతున్నారు. కొండపిలో తెలుగుదేశం అభ్యర్థి వీరాంజనేయస్వామి గట్టి ధీమాలో ఉండగా.. మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా గెలుపుపై నమ్మకంగానే ఉన్నారు. ఇక పశ్చిమాన రెండు, మూడు నియోజకవర్గాలు వైసిపికి అనుకూలంగా ఉన్నాయనే చర్చలు వినిపిస్తున్నాయి. తూర్పు నియోజకవర్గాలు తెలుగుదేశం అభ్యర్థులకు అనుకూలంగా ఉంటాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ప్రకాశంలో చెరిసగం సీట్లు దక్కుతాయనే చర్చ కూడా వినిపిస్తోంది. ఏదేమైనా గతంలో ఉన్న భారీ మెజార్టీలు మాత్రం ఈ సారి కనిపించేలా లేవు. గత ఎన్నికల కన్నా పలు నియోజకవర్గాల్లో పోలింగ్ పెరిగింది. మహిళలు, బయట నుంచి వచ్చిన వలస ఓటర్లు, విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎవరికి ఓటేశారనే దానిపై ఇప్పటికే చర్చ సాగుతోంది. ఓటర్లకు డబ్బులు ఇచ్చి తరలించారు. వలస ఓటర్లను బాగా సమీకరించారు. మహిళల ఓట్లపైనా ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగులు మెజార్టీ తెలుగుదేశం వైపు మొగ్గు చూపారనే చర్చ సాగుతోంది. ఏదేమైనా నియోజకవర్గాల్లో ఉత్కంఠగా విశ్లేషణలు నడుస్తున్నాయి. క్షేత్రస్థాయి పార్టీశ్రేణులు ఇచ్చిన సమాచారం ఆధారంగా గెలుపుపై ధీమాలో నేతలున్నారు.

ఆనందబాబు గృహ నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

హౌస్ అరెస్ట్ చేసి నోటీసులు అందజేశారు. మాచర్ల హింసకాండలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రవేశిస్తే మరింత ఉద్రుతం అవుతుందనే కారణంతో హౌస్ అరెస్ట్ చేసి నోటీసు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం పై ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి హింసకాండ సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందనే భయంతోనే టీడీపీ కూటమి నేతలపై, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి విజయం సాధిస్తుందని, అనంతరం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇలాంటి ఘటనపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పోలీస్ స్టేషన్ వద్ద తాటిపర్తి చారిటబుల్ ట్రస్ట్ హెచ్ఎన్‌సి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, శింగరాయకొండ గ్రామపంచాయతీ సర్పంచ్ తాటిపర్తి వనజ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత నెలలోనే ప్రారంభించాల్సిన ఈ చలివేంద్రాన్ని ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, నవలం కోటేశ్వరరావు, రాయి వీరాస్వామి, తన్నీరు ధర్మరాజు, షేక్ సలీంబాషా, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

మట్టి మాఫియా ఇష్టారాజ్యం

- చెరువులో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్న వైనం - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. మండలంలోని రెడ్డిచెర్ల చెరువులో గురువారం తెల్లవారుజాము నుంచి ఇష్టారాజ్యంగా చెరువులోని మట్టిని పొలాలకు, ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. ఎన్నికలు ముగిసినప్పటికీ ఇరిగేషన్ అధికారులు కానీ, రెవెన్యూ శాఖ గానీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మమ్మల్ని ఆపేదెవరు అన్న విధంగా అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో మైనింగ్ ఏడి దెబ్బకు మట్టి చోరులు భయపడేవారు. వారు విధించే జరిమానా దెబ్బకు మట్టిని దొంగిలించాలంటేనే బెంబేలెత్తిపోయేవారు. ఇప్పుడు ఏ అధికారీ పట్టించుకోకపోవడంతో అంతా మనదే రాజ్యం అన్న విధంగా మట్టి మాఫియా తయారయ్యింది. దీంతో వీరికి ఎవరైనా బడా బాబుల సహకారం ఉందా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రెడ్డిచర్ల చెరువులో నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు ఇప్పుడు చెరువులోనే మట్టి తీయడం వల్ల వచ్చే కొద్దిపాటి నీళ్లు కూడా ఇంకిపోతాయని రైతులు, గ్రామ ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తహశీల్దారు, ఇరిగేషన్ డీఈలకు ఇక్కడ జరిగే మట్టి మాఫియా సంగతులు తెలుస్తున్నాయా లేక మధ్యలోనే చిన్నపాటి ఉద్యోగులు దాచి పెడుతున్నారా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అధికారులు ప్రజా సమస్యలు కూడా గమనించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

మట్టిని తవ్వుతున్న ప్రొక్లెయినర్

ప్రత్యేక అవసరాల పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వచ్చే నెలలో బడిలో చేర్పించాలని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రమేష్ అన్నారు. గురువారం మండలంలో జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ రమేష్ సందర్శించారు. శానంపూడిలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రతిరోజూ సర్వే చేసిన వివరాలను గూగుల్ ఫామ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచనలు చేశారు. ఆ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారి బి శివన్నారాయణ, ఆఫీసు సిబ్బంది, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సిఆర్‌పి)లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు (సిడబ్ల్యుఎస్ఎన్) సర్వే, విద్యా కానుక, నాడు నేడు పనుల పురోగతి గురించి వివరాలు అడిగి తెలుసుకొని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యా కానుక స్టాక్ పాయింట్ గవర్నమెంట్ హైస్కూల్, మూలగుంటపాడు స్కూల్ ను సందర్శించారు. వీరి వెంట కె శ్రీహరి, సుల్తాన్‌బాషా, కూతల వంశీ, ప్రమీల, లలితకుమారి ఉన్నారు.

ఒంగోలులో భారీవర్షం

(మొదటిపేజీ తరువాయి)

కర్నూలురోడ్డు చెరువులా మారిపోయింది. భారీ వర్షానికి కాల్వలలోని నీరు బయటకు రావటంతో వాహనదారులు ముఖ్యంగా ద్విచక్రవాహన దారులు నానా ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటిలో ఆర్టీసి బస్సులు, వ్యాన్‌లు, ట్రాక్టర్లను నడుపుకుంటూ ముందుకు సాగారు. ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడవకుండా ఉండేందుకు పెట్రోల్ బంకులు, హోటళ్ళు, షాపింగ్ మాల్స్ వద్ద 2 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు వర్షంలోనే తడుచుకుంటూ వారి ప్రయాణాలను కొనసాగించారు. 2 గంటల పాటు కురిసిన వర్షంతో నగర ప్రజలు సేద తీరారు. అదేవిధంగా ఒంగోలు నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురియటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలు దున్నటానికి ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఆస్తి కోసం అంత్యక్రియలు అడ్డగింత

(మొదటిపేజీ తరువాయి)

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా మతదేహానికి అంత్యక్రియలు నిర్వహించే విషయమై గొడవ జరుగుతోంది. మతుడికి చెందిన ఒక కొష్టం, ఇల్లును కూడా దాయాదుల పిల్లలు ఆక్రమించుకొని ఉన్నారని, ఆస్తి వ్యవహారం కోర్టులో ఉన్నందున అంత్యక్రియలు నిర్వహించేంతవరకు తాను అక్కడ నుంచి కదలబోమని మతుడి భార్య రవణమ్మ, పిల్లలు భీష్మించారు. దీంతో ఈ వ్యవహారం పోలీస్ అధికారుల వరకు వెళ్లింది. స్థానిక ఎస్ఐతో పాటు ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్నా ఎటువంటి ఫలితం లేదు. దీంతో గురువారం నాటికీ అంత్యక్రియలు పూర్తి కాకపోవడంతో మతదేహం దుర్గంధం వ్యాపిస్తూ.. గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

పొగాకు సరాసరి ధరలో 'కొండపి' ప్రథమం

ప్రజాశక్తి-కొండపి

ఒంగోలు ఆర్ఎం పరిధిలో ఉన్న 5 వేలం కేంద్రాలలో కొండపి వేలం 25 సరాసరి ధరలో ప్రథమ స్థానంలో ఉంది. వెల్లంపల్లి-2లో సరాసరి ధర కిలో రూ.271.97, ఒంగోలు-1 సరాసరి ధర కిలో రూ.270.24, ఒంగోలు-2 సరాసరి ధర కిలో రూ.269.49, టంగుటూరు-1లో సరాసరి ధర కిలో రూ.264.59, కొండపి వేలం కేంద్రంలో సరాసరి ధర కిలో రూ.277.18 పలికిందని వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. గరిష్ఠ ధరలో కొండపి వేలం కేంద్రంలో ద్వితీయ స్థానంలో ఉంది. ఒంగోలు-1, ఒంగోలు -2లో గరిష్ఠ ధర కిలో రూ.303 ఉండగా కొండపిలో 302, వెల్లంపల్లి-1లో, టంగుటూరు-1లో 301 పలికిందని తెలిపారు. దీనిబట్టి చూస్తే పొగాకు ధరలు ఆశాజనంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి

ప్రభుత్వ వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-కనిగిరి

డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కనిగిరి పట్టణంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, పరిసరాల శుభ్రత ముఖ్యమని సూచించారు. ఇంటి పరిసరాల్లోని నీటి నిల్వలలో ఎడిస్ అనే ఆడ దోమ వల్ల డెంగ్యూ మరియు చికెన్ గునియా వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రియర్శ నంద, డాక్టర్ ఫణి, డిపిఎంఓ ప్రసాద్‌రెడ్డి, పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు, పారా లీగల్ వాలంటీర్ నవ కుమార్, కరేటి మాస్టర్ రాజేష్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్యసిబ్బంది

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

వైపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆర్థికంగా వెనుకబడిన పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని యర్రగొండపాలెం ప్రభుత్వ ప్రాంతీయ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా అన్నారు. గురువారం ప్రాంతీయ వైద్యశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెంలోని ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో ఇప్పటికే 24 మంది వైద్యులు, 55 మంది వైద్య సిబ్బంది ఉన్నారన్నారు. కింద స్థాయి సిబ్బంది కొంతమేర తక్కువగా ఉన్నారని తెలిపారు. రోగుల కోసం వైద్యశాలలో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్యశాలలో కొన్ని పరికరాలు లేని కారణంగా చికిత్సలకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇప్పటి నుంచి ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన సెల్ ఫోన్‌ను తీసుకొని రావాలని అన్నారు. దీని ద్వారా ఆయుష్మాన్ భారత్ కార్డు మంజూరు చేస్తామని తెలిపారు. ఇలా చేయడం ద్వారా ఎక్కడైనా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటే అక్కడ కూడా మీ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయని చెప్పారు. ప్రతి నెలా గర్భిణులు 150 మంది వరకు ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. రక్త నిలువ కేంద్రం ఉన్నప్పటికీ రక్తం అందుబాటులో లేకపోవడం వల్ల కొంతమేర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. రక్తాన్ని సేకరించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. రోగులకు అత్యవసర సమయంలో చికిత్స అందించేందుకు వెంటిలేటర్ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రోగులకు అన్ని రకాల రక్త పరీక్షలకు సంబంధించి పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 24 గంటలు పేద ప్రజలకు వైద్య చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

డాక్టర్ దేవర యదిద్యా

మార్కాపురంలో..

జోరందుకున్న బెట్టింగులు

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో ఎన్నికల సమరం ముగిసింది. జూన్ 4న ఫలితాల కోసం జనం ఎదురు చూస్తున్నారు. ఆ ఫలితాల్లో గెలిచేది ఎవరు.. ఓడేది ఎవరు.. అనే దానిపై ప్రధాన పార్టీల నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. గెలుపు మాదంటే... మాదేనని ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి నేతలు గట్టి ధీమాతో ఉన్నారు. ఈ నేపథ్యంలో జోరుగా బెట్టింగులు కూడా సాగుతున్నాయి. రూ.కోట్లలో బెట్టింగులు నడుస్తున్నాయి.

మార్కాపురం నియోజకవర్గంలో వైసిపి తరపున అన్నా వెంకట రాంబాబు, టిడిపి తరపున కందుల నారాయణరెడ్డి పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ జావీద్ అన్వర్‌తో పాటు మరో 26 మంది పోటీలో ఉన్నారు. వీరందరి పోటీ నామమాత్రమే. వైసిపి, టిడిపి మధ్యనే పోరు సాగింది. ఆ రెండు పార్టీల అభ్యర్థుల్లోనే గెలుపోటములు ఉండనున్నాయి. నియోజకవర్గంలో 2,14,608 ఓట్లు ఉండగా అందులో 1,87,952 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా 87.58 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధిక శాతం ఓటింగ్ జరగడం నియోజకవర్గ చరిత్రలో ఇదే ప్రథమం. అర్ధరాత్రి వరకు క్యూ లైన్‌లో నిల్చుని మరీ ఓటేశారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నందునే ఓటింగ్ శాతం పెరిగిందని టిడిపి భావిస్తోంది. వైసిపి మాత్రం వివక్ష లేకుండా సంక్షేమం అందించామని, అందులో మహిళలే అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని, ప్రస్తుత పోలింగ్ శాతం తమకు అనుకూలమని పేర్కొంటోంది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. సాధారణంగా మార్కాపురం నియోజకవర్గంలో వైసిపికి ఓటర్లు మొగ్గు చూపడం ఆనవాయితీగా వస్తోంది. అన్నా వెంకట రాంబాబు గెలుపొందుతారని వైసిపి నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, ఉద్యోగుల్లో సానుకూలతతో పాటు టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి పలుమార్లు ఓడిపోవడం, ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడం వంటి అంశాలతో సానుభూతి ఉందని టిడిపి నేతలు అంటున్నారు. కందుల నారాయణరెడ్డి కూడా ఇదే నాకు చివరి ఎన్నికలంటూ ప్రచారం చేసుకున్నారు. ఈ క్రమంలో టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి గెలుస్తారని కొందరు బెట్టింగులు పెడుతున్నారు.

ఓటరు నాడి అంతుచిక్కపోవడం.. తామంటే తాము గెలుస్తామని ధీమాతో అభ్యర్థులు ఉండటంతో బెట్టింగులు తారా స్థాయికి చేరుకున్నాయి. గెలుపు మీద.. మెజార్టీల మీద పందేలు కొనసాగుతున్నాయి. వైసిపి తరపున పోటీ చేసిన అన్నా రాంబాబు గెలుస్తారని వైసిపికి చెందిన కీలక నేత రూ.50 లక్షలు ఒకటే పందెం కాశాడు. అవతల కూడా కందుల నారాయణరెడ్డి గెలుస్తాడని అదే స్థాయిలో పందెం కాశారు. రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు పందెం పెట్టిన వారు వందల్లో ఉన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గం అంతటా బెట్టింగ్ పైకం రూ.100 కోట్లు దాటిందని అంచనా.

మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంపై పట్టణంలో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో ఆ గ్రామంలో 270 ఓట్లు వైసిపికి మెజార్టీ లభించింది. ఈ ఎన్నికల్లో అక్కడ ఆ మెజార్టీ ఉండబోదని టిడిపి నేతలు అంటున్నారు. వైసిపికి ఒక్క ఓటు మెజార్టీ లభించదనేది టిడిపి వాదన. ఒక్క ఓటైనా మెజార్టీ వైసిపికి లభిస్తుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బెట్టింగులు కూడా ఒక్క ఓటుపై జరుగుతున్నాయి. వైసిపికి ఆ గ్రామంలో ఒక్క ఓటు కూడా మెజార్టీ రాదని టిడిపి నేత ఒకరు రూ.25 లక్షలు పందెం కాశాడు. వైసిపికి చెందిన వ్యక్తి కూడా ఒక్క ఓటైనా మెజార్టీ వస్తుందని రూ.25 లక్షలు పందెం పెట్టారు. ఇదే ఒక్క ఓటు.. ఆ పైన మెజార్టీ లభిస్తుందని వైసిపి నేతలు పందేలు కాస్తున్నారు. టిడిపి నేతలు కూడా పందెం విషయంలో బోడపాడు గ్రామ మెజార్టీపై పోటీ పడుతున్నారు. జూన్ 4న ఫలితాలు ఎలా ఉండబోతాయో తెలియదు కానీ... ఓడిన అభ్యర్థి తరపున గెలుస్తారని పందేలు కాసిన వారు రూ.కోట్లలో నష్టపోక తప్పదు.

బైండోవర్ ఉల్లంఘనతో..

ముగ్గురికి రూ.లక్ష చొప్పున జరిమానా?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాట్లాడుతున్న సిఐ రాములు నాయక్

యర్రగొండపాలెం మండలంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత నీటి ట్యాంకర్ల దగ్గర మహిళలు నీళ్లు పట్టుకునే విషయంలో జరిగిన కీచులాట కాస్తా పెద్దదై వాదంపల్లి గ్రామం రెండు వర్గాలుగా విడిపోయి రాళ్లదాడి చేసు కున్న నేపథ్యంలో దాడికి పాల్పడిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మండల మేజిస్ట్రేట్ ద్వారా జరిమానా విధిస్తున్నట్లు యర్రగొండ పాలెం సిఐ కె రాములునాయక్ తెలిపారు. గురు వారం ఆయన యర్రగొండపాలెంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో యర్రగొండపాలెం మండలంలో ముందస్తుగా 500 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే బైండోవర్ నమోదు చేసిన వారిలో ముగ్గురు వాదంపల్లికి చెందిన వారు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినట్లు చెప్పారు. వీరిని మండల మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. జరిమానా చెల్లించని యెడల వారి ఆస్తులు జప్తు చేసి జరిమానా రుసుం సేకరిస్తామని తెలిపారు. ఆస్తులు లేకపోతే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని అన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో సమస్యలు ఎదురైనప్పుడు గొడవలకు దిగకుండా శాంతియుతంగా సమస్యలు పరిష్కరించు కునేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుదర్శన్ పాల్గొన్నారు.

దళిత యువకులు అల్లర్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రస్తుతం జరిగిన ఎన్నికల అనంతరం, రాజకీయ పార్టీల గొడవలకు, అల్లర్లకు, దళిత యువకులు దూరంగా ఉండాలని, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ కోరారు. స్థానిక ఎంఎస్‌పిఎస్ కార్యాలయంలో గురువారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం కొన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం, దళిత యువకులను ప్రలోభపెట్టి, గొడవలకు ప్రోత్సహించే ప్రమాదం ఉందని అన్నారు. ప్రలోభాలకు ఆశపడి గొడవలు, అల్లర్లలో పాల్గొంటే పోలీస్ కేసులు నమోదు అవుతాయని, తద్వారా పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి, డబ్బులు, పరువు పోగొట్టుకోవాల్సి వస్తుందని అన్నారు. దీంతో దళిత కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. యువకులపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని, రౌడీషీట్లు కూడా తెరిచే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు, పోలీస్ కేసులు నమోదైతే ప్రతి ఎన్నికలకు వారిని తీసుకువెళ్లి, పోలీస్ స్టేషన్లో ఉంచుతారన్నారు. ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా, ఆశ చూపించినా మీ విలువైన భవిష్యత్తును చెడగొట్టుకోవద్దని సుజన్ మాదిగ కోరారు.

20న ఎడ్ల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్: పట్టాభి రామస్వామి తిరునాళ్ల సందర్భంగా మండలంలోని రామాపురం గ్రామంలో ఈ నెల 20వ తేదీ ఎడ్లతో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నారా కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, వైఎస్ఆర్ కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల ఎడ్ల యజమానులు ఈ నెల 19వ తేదీ లోపు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9666673735, 8499036565, 9611118712 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వికలాంగునికి ఆర్థిక సాయం చేయండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆపరేషన్ చేయించుకొని మంచంలో ఉన్న దివ్యాంగుడు

యర్రగొండపాలెం మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన మండ్ల యోగి రాములు అనే దివ్యాంగుడు బ్యాటరీ ట్రై సైకిల్‌పై ప్రతిరోజూ యర్రగొండపాలెం వచ్చి ఐసులు కొనుగోలు చేసి తిరిగి నరసాయపాలెం వెళ్లి విక్రయించుకొని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇదే క్రమంలో రెండు రోజుల కిందట యర్రగొండపాలెం వస్తుండగా అతని బ్యాటరీ ట్రై సైకిల్‌కు ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీ కొట్టింది. అతనికి కుడి కాలు విరిగింది. నరసరావుపేటలో ఆపరేషన్ చేయించుకొని ఇంటికి చేరాడు. కుటుంబ పోషణ భారంగా ఉంది. విషయం తెలుసుకున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పోలేపల్లి పెద్ద పాలంకయ్య గురువారం దివ్యాంగుడిని పరామర్శించారు. వాకింగ్ స్టాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన యోగి రాములు అనే దివ్యాంగునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. కుటుంబ పోషణ భారంగా ఉందని అన్నారు. దాతలు 7032257397 ఫోన్ పే నెంబర్‌కు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

వైఎస్ఆర్‌టియుసి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

చిన్న తిరుపతిని పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షుడు మేకల చిన్నతిరుపతి (బాలు)ని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్ఆర్ టియుసి జిల్లా అధ్యక్షుడు మేకల చిన్న తిరుపతిపై సోమవారం సిఎస్ పురం టిడిపి కార్యకర్తలు దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడిలో మేకల చిన్న తిరుపతికి స్వల్ప గాయాలు కాగా కనిగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం రాత్రి కొండరాజుపల్లి లోని చిన్న తిరుపతి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ టిడిపి నాయకుల దౌర్జన్యాలకు ఎవరూ భయపడవద్దని, వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దద్దాల వెంట జడ్పిటిసి సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపిటిసి బైరెడ్డి తిరుపతిరెడ్డి, బత్తుల మాల్యాద్రి, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బోల్తా పడిన బొలెరో వాహనం

బొలెరో వాహనం బోల్తా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

బొలెరో వాహనం బోల్తా పడి 15 మందికి గాయాలైన సంఘటన పెద్దదోర్నాల మండలంలోని చిన్నారుట్ల సమీపంలోని ఆంజనేయస్వామి గుడివద్ద జరిగింది. ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పేలకుర్తి గ్రామానికి చెందిన 25 మంది భక్తులు బుధవారం రాత్రి రెండు వాహనాల్లో శ్రీశైలం స్వామి దర్శనానికి వెళుతుండగా ఒక వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రేమ్ కుమార్, నగేష్, వెంకటరాములు, రమేష్, కేశవులు, మనోహర్, సురేష్, కుమార్, తదితర 15 మంది గాయపడ్డారు. వీరిని 108 సహాయంతో సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నారు. ఎస్ఐ అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కాలమ్

బోల్తా పడిన వాహనం

టమోటా లారీ బోల్తా

ప్రజాశక్తి-కొమరోలు

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో కడప అమరావతి రాష్ట్రీయ రహదారిపై గురువారం టమాటా లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. నిద్రమత్తు వల్లే ఈ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని లారీ డ్రైవర్ వెల్లడించారు. మదనపల్లి నుంచి గుంటూరుకు టమోటా లోడుతో వెళ్తుండగా ఈ రోడ్డు ప్రమాదం జరిగింది.

మృతి చెందిన గొర్రెలు

కుక్క దాడిలో 18 గొర్రెల మృతి

ప్రజాశక్తి-సింగరాయకొండ: జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు గ్రామంలో పారాబత్తిన మాల్యాద్రికి చెందిన 18 గొర్రెలు కుక్క దాడిలో తీవ్రంగా గాయపడి గురువారం చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని మాల్యాద్రి తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రంథపాలకుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కథలు చెప్పడంతో పాటు పిల్లల చేత చెప్పించారు. అదే విధంగా డ్రాయింగ్ పోగ్రాం నిర్వహించారు. తెలుగు పదాలను రాసి వాటిని ఇంగ్లీషులో రాయించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి

బాపట్లలో డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ

చీరాలలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

దోమకాటుతో సంక్రమించే డెంగ్యూ వ్యాధి నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమౌతోందని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండు, గడియార స్తంభం మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. డెంగ్యూ నివారణ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య అధికారి విజయమ్మ మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. దోమ కాటు బారిన పడకుండా దోమతెరలు వాడాలని అన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని అన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట దోమలు వృద్ధి చెందకుండా నీటిలో కిరోసిన్, మడ్డి ఆయిల్ చల్లాలని అన్నారు. డెంగ్యూ జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోని వైద్యుల సలహా మేరకు నివారణకు అవసరమైన ఔషధాలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా అధికారి కె ప్రేమ్ చంద్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి బి బ్రహ్మానందం, జిల్లా డెమో సెక్షన్ ప్రతినిధి బి మరియమ్మ, ఆర్ అరుణ, సబ్ యూనిట్ అధికారులు ఎండి షకీల్, ఎస్కె ఖదీర్, బి వెంకటేశ్వర్లు, పట్టణ హెల్త్ సూపర్ వైజర్ జుగుంట రాంబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల : డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పిపిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ వై యాకోబు అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా వైద్యశాల వద్ద డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇంటి ఆవరణ చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి పరిసరాల చుట్టూ మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. దోమల లార్వా లేకుండా తీసివేయలని అన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, పాస్టిక్ వ్యర్థ పదార్థాలు లేకుండా చూడాలని చెప్పారు. డెంగ్యూ వ్యాధి వలన కలిగే లక్షణాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో

అద్దంకిలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

వైద్యాధికారులు డాక్టర్ ప్రణయానంద, డాక్టర్ ఎస్ ప్రణయ్ కుమార్, మలేరియా నివారణ అధికారి చింతా శేషుబాబు, కెపి దాసు, అనిల్ కుమార్, బీబీమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి : సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని గాజులపాలెం అర్బన్ పిహెచ్‌సి వైద్యులు గొట్టిపాటి జయసింహ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీని వైద్య సిబ్బందితో కలిసి గురువారం నిర్వహించారు. డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ కాటు వలన కలిగే ప్రమాదాలు గురించి ప్రజలకు వివరించారు. వాటిని అరికట్టుటకు దోమతెరలు వాడడం, పరిసరాలు పరిశుభ్రంగా చేసుకోవడం చేయాలని అన్నారు. నీళ్ల నిలవ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి హెల్త్ సూపర్వైజర్ వి వెంకాయమ్మ, ఎఎన్ఎంఎస్, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

పొదిలి : పట్టణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్ చంద్ర, సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి రాకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పాత టైర్లు, కొబ్బరికాయ చిప్పలు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు ఇంటి ఆవరణలో లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని అన్నారు. నీటి నిల్వలను, పాత్రలను శుభ్రపరచి నీరు నింపుకోవాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో యుపిసీ సిబ్బంది, ఎంసీహెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలిలో డెంగ్యూ అవగాహన ర్యాలీ

దేవాలయ భూముల కౌలు వేలం

- వేలంలో ఉత్సాహంగా పాల్గొన్న రైతులు
- గతం కన్నా పెరిగిన కౌలు ధరలు

ప్రజాశక్తి - పంగులూరు

దేవాలయ భూముల కౌలు వేలం జరుగుతున్న దృశ్యం

మండల కేంద్రమైన పంగులూరులోని భీమలింగేశ్వర స్వామి దేవాలయం, వేణు గోపాలస్వామి దేవాలయం, వీరేశ్వర స్వామి దేవాలయంకు చెందిన భూముల కౌలు వేలం గురువారం పంగులూరులో దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించారు. భీమలింగేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన 47ఎకరాల 28 సెంట్లు మెట్ట భూమి, వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన 14 ఎకరాల 34 సెంట్లు మెట్ట భూమి, వీరేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 25 ఎకరాల మెట్ట భూమికి కౌలు వేలం నిర్వహించారు. మూడేళ్ల కాల పరిమితితో జరిగిన కౌలు వేలంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు. గత మూడేళ్ల క్రితం జరిగిన కౌలు వేలం కన్నా ఈసారి జరిగిన వేలం పాటలో భూముల కౌలు రేటు భారీగా పెరిగినట్లు పంగులూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి యు శ్రీనివాసరావు తెలిపారు. భీమ లింగేశ్వర స్వామి దేవాలయంకు చెందిన 47 ఎకరాల 28 సెంట్లు భూమి కౌలు గతంలో రూ.6.70లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.12.51లక్షలకు పాడారు. రూ.5.81 లక్షలు అదనంగా పెరిగింది. వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన 14 ఎకరాల 34 సెంట్లు భూమికి గతంలో రూ.93వేలు కౌలు రాగా ప్రస్తుతం రూ.1.19లక్షల కౌలు పలికింది. ప్రస్తుతం అదనంగా రూ.26వేలు కౌలు పెరిగింది. వీరేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 25 ఎకరాల భూమికి గతంలో రూ.2.64లక్షల కౌలు రాగా ప్రస్తుతం రూ.4.65లక్షల కౌలు పాట జరిగింది. ప్రస్తుతం రూ.2.01లక్షలు అదనం గా కౌలు ఆదాయం పెరిగింది. కౌలు వేలంలో రైతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, ప్రతిఏటా క్రమం తప్పకుండా కౌలు చెల్లిస్తూ, భూములు సాగు చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. రైతులు సాగు చేసుకోవడం ద్వారా ఆదాయం పొందడంతోపాటు సకాలంలో కౌలు చెల్లించి దేవాలయాల అభివృద్ధికి, స్వామి వారి ధూప, దీప, నైవేద్యంతోపాటు ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సింగరకొండ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఈఓ ఎస్ కోటిరెడ్డి, తాళ్లూరు గ్రూపు దేవాలయాల ఈఓ గుంటుపల్లి వాసు బాబు, పంగులూరు భీమలింగేశ్వర స్వామి దేవాలయం ట్రస్ట్ కమిటీ చైర్మన్ బాచిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ ధనమ్మ

నీతి కథలతోనే నైతిక విలువలు

ప్రజాశక్తి - చీరాల

చిన్న పిల్లలకు నీతి కథలు, విజ్ఞానాన్ని అందిచే పుస్తకాలు పిల్లల జీవితంలో నైతిక విలువలు పెంచుతాయని, పిల్లల మానసిక ఎదుగుదలకు దోహదపడతాయాని గ్రంధపాలకురాలు ధనమ్మ అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాల వేసవి శిక్షణా తరగతులులో భాగంగా చిన్నారులకు జాతీయ నాయకుల జీవిత చరిత్రలకు సంబందించిన పుస్తకాలతో పుస్తకపఠనం గురువారం చేయించారు. విద్యార్థుల చేత కథలను చదివించినట్లు తెలిపారు. పిల్లల మానసిక ఆనందం కోసం క్యారమ్స్, చెస్ ఆడించినట్లు తెలిపారు. శిక్షణ తరగతులు జూన్ నెల 7వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగా ఎక్కువ మంది హాజరై వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. గ్రంధాలయంలో కొత్తగా వచ్చిన పుస్తక సంపదను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

108లో కాన్పు చేసిన సిబ్బంది

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని తంగేడుమల్లి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సరిమెళ్ళ రోజామనికి గురువారం ఉదయం పురిటి నొప్పులు అధికమవడంతో 108కు సమాచారం ఇచ్చారు. దీంతో సంతమాగులూరు 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. రోజామణిని సంతమాగులూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమవడంతో సిబ్బంది ఈఎంటి ఖాదర్ మస్తాన్ వాహనంలోనే ప్రసవం చేశారు. రోజామణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండడంతో 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

క్రీడాకారునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీరాల

చైనాలో బీచ్ పేరా వాలీ వరల్డ్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన పందిళ్లపల్లికి చెందిన పిచ్చుక నాగరాజు అనే వికలాంగుడైన క్రీడాకారునికి రూ.13వేలు ఆర్థిక సహాయం స్థానిక రోటరీ భవనంలో రోటరీ సభ్యులు గురువారం అందజేశారు. నాగరాజు క్రీడల్లో బాగా రాణించి చీరాలకు మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, బి హేమంత్ కుమార్, డివి సురేష్, జివై ప్రసాద్, ఎస్వి స్వామి, శేష సాయి, గుర్రం రాఘవరావు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్రవంతి

కామాక్షి హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ నందు గురువారం ఉచిత వైద్యశిభిరం నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యాన్ని పొందాలని, తెల్ల కార్డు ఉన్నవారికి అన్ని రకాల చెవి, ముక్కు, గొంతు ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ స్రవంతి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 55మందికి వైద్య పరీక్షలు చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఎముకల ఆపరేషన్లు, కడుపుకు సంబంధించిన ఆపరేషన్లు, కిడ్నీలో రాళ్లు వున్నవారికి, మూత్ర సంబంధిత ఆపరేషన్లు, డయాలసిస్ వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు తెలిపారు. అత్యవసర వైద్యసేవలు 24గంటలు చేయనున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ షుగర్ స్పెషలిస్ట్ జి నవీన్, డాక్టర్ తాడివలస కుమార్, జిఎం తాడివలస సురేష్ పాల్గొన్నారు.

ఉద్యాన రైతు విలవిల

- అడుగంటుతున్న బోర్లు
- అప్పులపావుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వర్షం జాడలేదు. కరవు నేలలో భూగర్భ జలం కానరాకుండా పోతోంది. బోర్లు, బావుల్లోని నీటి లభ్యతను నమ్ముకుని సాగు చేసిన ఉద్యాన పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. యర్రగొండపాలెం నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో వర్షాధారంగా ఏటా 32 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. బోర్లు వేయించుకుని పంటలు సాగు చేసే రైతుల సంఖ్య పెరిగిపోయింది. ఐదు మండలాల్లో 20 వేల వరకు బోర్లు ఉన్నాయి. గత ఖరీఫ్ నుంచి వర్షం జాడ కరవయ్యింది. దీంతో ఎక్కడికక్కడ బోర్లలో నీటి లభ్యత అడుగంటుతోంది. చాలా వరకు బోర్లు, బావులు ఎండిపోయాయి. రబీలో సాగు చేసుకున్న వివిధ రకాల పంటలను కాపాడుకోవడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు.

ఉద్యాన పంటలకు నష్టం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో 11,316 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఆ పంటలకు ఇప్పటికే రూ.లక్షల్లో ఖర్చు పెట్టారు. ఈసారి మామిడి, బత్తాయి, దానిమ్మ, నిమ్మ, బొప్పాయి, అరటి పంటలకు బహిరంగ మార్కెట్టులో మంచి ధర ఉంది. ఆయా పంటలు ప్రస్తుతం కాయ దశలో ఉన్నాయి. వాటికి నీటి లభ్యత చాలా అవసరం. తడులు ఇచ్చేకొద్దీ పంట దిగుబడి పెరగనుంది. బోర్లు అడుగంటుతుండగా పంటలకు నీటి తడులు అందడం ఇబ్బందిగా మారింది. తడి అందక అనేక గ్రామాల్లో ఉద్యాన పంటలు వాడు ముఖం పట్టాయి. వాటిని కాపాడుకోవాలన్న ఉద్దేశంతో కొత్తగా రైతులు బోర్లు వేయిస్తున్నారు. వెయ్యి అడుగుల లోతు తవ్వించినా వాటిలో కూడా నీటి జాడలేదు. కళ్లెదుటే ఎండుతున్న ఉద్యాన పంటలను చూస్తున్న రైతులు విలవిలలాడి పోతున్నారు.

ఎండిపోయిన నిమ్మ తోట

దిగుబడి తగ్గింది: ముండ్లా దానియేలు, రైతు, గుర్రపుశాల, యర్రగొండపాలెం మండలం

ఆరు ఎకరాల్లో బత్తాయి పంటను సాగు చేశా. పంట బాగా దిగుబడి వచ్చే సమయంలో బోరు ఎండి పోవడంతో పూత, పిందె రాలిపోయింది. మరలా రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టి రెండు బోర్లు వేయిస్తే అందులోనూ నీటి లభ్యత లేదు. దీంతో ఈసారి అన్ని రకాలుగా నష్టాన్ని ఎదుర్కొంటున్నాం.

బోరు వేయించినా ప్రయోజనం లేదు

గుడిమెట్ల గాలెయ్య, రైతు, సోమేపల్లి, త్రిపురాంతకం మండలం

ఒక ఎకరాలో నిమ్మ తోటను నాటాను. తోటను కాపాడుకోవడానికి రూ.ఐదు లక్షల దాకా ఖర్చు పెట్టాను. బోరు వేయిస్తే చుక్క నీరు పడలేదు. ఉన్న బోరులో నీటి లభ్యత తగ్గి ఎండిపోతోంది. పంటను దక్కించుకోవడానికి పడుతున్న ఇబ్బంది మాటల్లో చెప్పుకోలేనిది. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ట్యాంకర్లతో నీళ్ల తోలి తడులు పెట్టాను. అయినా తోటంతా ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది.

పుస్తక పఠనం చేయిస్తున్న కోటేశ్వరి

విద్యార్థులతో పుస్తక పఠనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రెండో రోజైన గురువారం గ్రంథాలయంలో పుస్తక పఠనం, స్టోరీటెల్లింగ్, విద్యార్థులతో కథలు చదివించటం, కథలు చెప్పించటం చేశారు. కార్యక్రమాన్ని ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరం ఉద్దేశం పిల్లలలో పుస్తక పఠనం అలవాటు చేయటం, వారిలో సృజనాత్మకతను పెంపొందేలా చేయటంతో పాటు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ చక్కని అవకాశాన్ని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ వేసవి శిక్షణా శిబిరం జూన్ 7 వరకు జరుగుతుందని తెలిపారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

అడవులను బాధ్యతగా సంరక్షించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రజలు బాధ్యతతో అడవులను సంరక్షించాలని ట్రైనీ ఎఫ్ఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. గురువారం ఆయన శ్రీశైలం ఘాట్ రోడ్డులో వెళుతున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అడవికి నిప్పు పెట్టే చర్యలకు దూరంగా ఉండాలని అన్నారు. పర్యావరణానికి హాని చేయవద్దని చెప్పారు. అడవిని కాపాడే విధిలో అటవీ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు. కోర్ ఏరియాలో ఉండే పులులకు విఘాతం కలిగించకూడదన్నారు. బేస్ క్యాంపులు, ఏకో టూరిజంలు తనిఖీ చేశారు. శ్రీశైలం వెళ్లే వాహనదారులు ఘాట్ రోడ్డులో పాలిథిన్ కవర్లు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు పడేయరాదన్నారు. అలా చేయడం మూలంగా జంతువులకు ప్రాణ హాని ఉంటుందని అన్నారు.

డీప్ బోరుతో నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలో వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపడుతున్నామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం కనిగిరి పట్టణంలోని 4,5 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించి ప్రజలను ప్రత్యక్షంగా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య వచ్చే ప్రాంతాలను ముందుస్తు గుర్తించి నీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 4,5వ వార్డులో డీప్-బోర్ ద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాజు, వైసీపీ నాయకులు నరసయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

రాహుల్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-కనిగిరి

ఏపీపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభను చాటిన వి రాహుల్ కుమార్‌ను గురువారం జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి షేక్ గయాజ్‌బాషా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. కనిగిరి ప్రాంతానికి చెందిన రాహుల్ 504 ర్యాంకు సాధించి ఈ ప్రాంత యువతకు ఆదర్శంగా నిలిచారని ఆయన కొనియాడారు. రాహుల్ తల్లిదండ్రులు రత్నకుమార్, వయోలా రాణి ఇద్దరూ తనకు ఫ్యామిలీ ఫ్రెండ్స్ కావటం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కృషితో నాస్తి దుర్భిక్షం అన్న పదానికి రాహుల్ ఒక ఉదాహరణగా నిలిచారని, క్రమశిక్షణ గల విద్యార్థిగా నిరంతర అధ్యయనంతో తాను అనుకున్న లక్ష్యం సాధించారని, ఇందుకు వారి తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సాహం అందించారని అన్నారు. ఆయన వెంట గయాజ్ కుమారులు షేక్ సిరాజ్‌బాషా, షేక్ ఫరూక్ బాషా ఉన్నారు.

రాహుల్‌ని సత్కరిస్తున్న షేక్ గయాజ్ బాషా

అల్లీనగరం ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం అల్లీనగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం 2005-06 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నాటి సంగతులను నెమరు వేసుకున్నారు. ఆ విద్యా సంవత్సరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాల క్రితం తాము పదో తరగతి వరకు ఈ పాఠశాలలో చదివామని అప్పటి మధుర స్మృతులు, తీపి సంఘటనలు గుర్తుకు వస్తున్నాయని, వాటిని నెమరు వేసుకొని ఆనందిస్తున్నామని ఆ కలయిక తమకు గర్వకారణంగా ఉందని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఈనాటి కలయిక మరపురానిదని వారు పేర్కొన్నారు. విద్యా బోధన చేసిన గురువులకు భక్తితో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహాయ సహకారాలు అందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామిని కూడా భక్తితో సన్మానిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు గురుస్వామి, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ ఎన్డీఎల్ నారాయణ, రఘురాం, వి కుమార్, రికార్డ్ అసిస్టెంట్ బాలాజీ, రసూల్ బి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఆంజనేయ చౌదరి, రవికుమార్, ఎంవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

ఈత కొలనులో చిన్నారుల కేరింతలు

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులకు వేసవి సెలవు రావడంతో దర్శిలోని కురిచేడు రోడ్ ఎన్ఎస్‌పి కాలువ సమీపాన గల మోహన్ మిల్క్ లైన్ వద్ద ఈతకొలను చిన్నారులతో కిక్కిరిసిపోయింది. గురువారం సాయంత్రం సమయంలో చిన్నారులందరూ ఈతకొలనులో కేరింతలు కొడుతున్నారు. ఇటీవల ఎన్నికలు రావడంతో సుదూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులతో వచ్చిన చిన్నారులు కూడా ఈతకొలనులో ఈత కొడుతుండడంతో తల్లిదండ్రులు, చిన్నారులు ఆనందిస్తున్నారు. ఆదివారం, వేసవి సెలవుల్లో చిన్నారులందరూ ఇక్కడ ఈత కొట్టి ఆనందిస్తుంటారు. ఎన్నికల సమయంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ జెర్సీ వద్దకు వచ్చి ఆట వస్తువులు అయిన ఉయ్యాలలు జారుడుబల్లలు లాంటివి ఆడి ఆనంద పడుతుంటారు. అదేవిధంగా ఐస్ క్రీములు, స్వీట్లు కొనుక్కొని అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో తింటూ ఆస్వాదిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇదే మాదిరిగా వస్తుంటామని సాఫ్ట్వేర్ ఇంజనీర్ అనిల్ తెలిపారు. ఈ విధంగా పిల్లలతో ఈతకొలను నిండిపోయింది. ఇది దర్శిలో చిన్నారుల కోసం నిర్మించిన ఒకే ఒక ఈతకొలను కావటం విశేషం.

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ చైతన్య కృష్ణ సారథ్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దామని సూచించారు. డెంగు వ్యాధి నిల్వ నీటిలో ఉండే ఈడీస్ దోమల వల్ల వ్యాపిస్తుందని తెలిపారు. డాక్టర్ ఉజ్వల మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఇంటి లోపల కుండీల్లో, కొబ్బరి బొండాల్లో, టైర్లలో ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చేయాలని సూచించారు. దోమతెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లీనా రేఫెల్, సిహెచ్ఓ సాంబశివరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్అలీ, రాజమ్మ, భాస్కర్, అక్బర్‌బాషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మూతపడిన ఆయుర్వేద వైద్యశాల

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్లుగా రోగులకు వైద్య సేవలు అందించిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు, సిబ్బంది లేక మూతపడింది. తమ్మన వీరయ్య, శేషారత్నమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన వైద్యశాల ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం పనిచేస్తుంది. భట్టిప్రోలులో ప్రాథమిక వైద్యశాలలు లేని సమయంలో ఈ వైద్యశాల నుండే అన్ని రకాల రోగాలకు వైద్య చికిత్సలు అందించేవారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసిన అనంతరం దీనిని ప్రత్యేకంగా ఆయుర్వేద వైద్యశాలగా మార్చారు. ఈ వైద్యశాల్లో ఇప్పటికీ అనేక మంది రోగులు ఆయుర్వేద ముందుకు అలవాటు పడినవారు చికిత్స పొందుతూ ఉంటారు. కాలక్రమేణ వైద్యశాల్లో ఉన్న సిబ్బంది రిటైర్మెంట్ కావటం మొదలైంది. దీంతో క్రమక్రమంగా వైద్యశాల మూత దశకు చేరుకుంది. ప్రభుత్వ వైద్య ప్రాథమిక వైద్యశాల ఏర్పడిన అనంతరం దీనిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి కూడా దూరమైంది. నిత్యం వర్షపు నీరు వైద్యశాల ఆవరణలో నిలబడి ఉంటుంది. ఆ నీటిలో చెట్ల ఆకులు రాలి రోజుల తరబడి వర్షపు నీరు మురుగునీరుగా మారి దుర్వాసన వెదజల్లుతుండేది. ఒకప్పుడు ఆయుర్వేద వైద్యశాలగా కూడా ప్రఖ్యాతి గాంచిన వైద్యశాల ప్రస్తుతం ఉన్న ఒక వైద్యుడు వేరే ప్రాంతానికి బదలీ కావడంతో ఈ వైద్యశాల పూర్తిగా మూతపడింది. గత ఏడాది ఆయుష్ శాఖ అధికారులు ఈ వైద్యశాలను పరిశీలించారు. దీనిని యోగ కేంద్రంగా రూపుదిద్ది ప్రజలకు యోగశాలగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అందుకు గాను ప్రభుత్వం నుండి నిధులు కూడా మంజూరైనట్లు ఆనాడు పత్రిక ముఖంగా పేర్కొన్నారు. కానీ ఆ నిధులు ఏమయ్యాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మూతపడిన ఈ వైద్యశాల ఇదేవిధంగా మూసి ఉంటే కాలక్రమంగా భవనాలు కూడా శిథిలావస్థకు చేరి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా బాగుండగానే ఈ భవనాన్ని వేరే అవసరాలకు వినియోగించుకుంటే ప్రజలకు దోహదపడుతుందని గ్రామస్తులు వ్యాఖ్య నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాలపై దృష్టి సారించి దీని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యులు లేక మూతపడ్డ భట్టిప్రోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

మానవతా సంస్థ ఆర్థిక సాయం

ప్రజాశక్తి- పొదిలి

నగర పంచాయతీలోని బాప్టిస్ట్ పాలెంలో గురువారం మృతి చెందిన గాలిముట్టి నాగులు కుటుంబానికి మానవతా సంస్థ ప్రతినిధులు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. సంస్థ సభ్యులు నాగులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మానవత డైరెక్టర్ శ్రావణి వెంకటేశ్వర్లు, కన్వీనర్ యల్లమందారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి అశోక్, ఎద్దు నగేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గిద్దలూరు

మండలంలో ఎవరైనా ఎన్నికలు అయిపోయాయి కదా అని అల్లర్లు, గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సిఐ సోమయ్య హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనావళి ప్రకారం బైండోవరైన వ్యక్తులు సంయమనం పాటించాలని సూచించారు. అలా కాకుండా ఇతరులను భావోద్వేగాలతో రెచ్చగొట్టడం, గొడవలకు, దాడులకు దారి తీస్తూ ఇబ్బందులకు గురి చేయాలని చూసిన, ఎన్నికల తీర్పు వెలువడిన తరువాత కూడ గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలకు వెళ్లి అనవసరమైన కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పడవద్దని సూచించారు. రాజకీయాల కోసం వివాదాల్లో తలదూర్చి కుటుంబాలను, భార్య, పిల్లలను ఇబ్బందులు పెట్టుకోవద్దని అన్నారు. గ్రామాల్లో శాంతియుత జీవన వాతావరణం ఉండేందుకు ప్రజలు సంయమనం పాటించాలని చెప్పారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సోమయ్య

వర్షంతో చల్లబడిన వాతావరణం

నూగు, పశుగ్రాసం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలో బుధవారం అర్ధ రాత్రి నుండి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో నిన్నటి వరకు ఎండ తీవ్రతకు అల్లాడిపోయిన ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల రోజుల నుండి ఎండ తీవ్రతకు తల్లడిల్లిన ప్రజలు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో వర్షంతో పొలాలు పదునెక్కడంతో రైతున్నలు నూగు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా లేక పోవడంతో పొలం మీద కాలువలు, కుంటల్లో నీరులేక మూగ జీవాలకు త్రాగు నీటికీ తల్ల డిల్లి పోయాయి. వేసవిలో పశువులకు దాహర్తి తీర్చడానికి నీటితొట్టిలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. అధికారులు ఎన్నికల విధులు కారణం చెప్పి ఇతర పనులను వదిలేశారు. ఆచరణలో ఎక్కడా నీటి తొట్లులు ఏర్పాటు చేయలేదు. దీంతో పశుగ్రాసంతో పాటు త్రాగు నీటికీ మూగ జీవాలు ఎదురు చూశాయి. పశు పోషకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలానికి తోలుకెళ్లిన పశువులకు మేత దొరకడం గగనమై ఒకవైపు మేతకోసం వెతుకుతూ మరో వైపు పశువులు తాగడానికి కూడా నీళ్లు దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బుధ, గురు వారాల్లో కురిసిన వర్షం కొంత ఊరటనిచ్చింది. రైతులకు ఆశలు చిగురించాయి. నూగు పంట తోపాటు పశుగ్రాసం సాగుకు అనుకూలంగా ఉంటుందని, పదునైన భూమిని సిద్ధం చేయనున్నట్లు రైతులు తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలోనే వ్యక్తి హత్య

హత్యకు గురైన వ్యక్తి నెల్లూరు వాసిగా గుర్తింపు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రశాంత్

పట్టణంలో బుధవారం రాత్రి హత్యకు గురైన యువకుడు నెల్లూరు నగరం పెన్నా నది వైకుంఠపురంకు చెందిన నాయుడు కుప్పం ప్రశాంత్ (24) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు హతుడు ప్రశాంత్ నెల్లూరులో గతంలోట హత్య కేసులో జైలుకు వెళ్లి కొద్దిరోజులు క్రితం బెయిల్‌పై వచ్చాడని తెలిపారు. అతని తల్లి, తండ్రి మధ్య సఖ్యత లేకపోవడంతో అవివాహితుడైన ప్రశాంత్ నెల్లూరులో తల్లి వద్దే ఉంటున్నాడు. తండ్రి జయరావు బాపట్ల అరవ కాలనీలో ఉంటున్నాడు. తండ్రికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి రెండు రోజుల క్రితం ప్రశాంత్ బాపట్లలోని తండ్రి వద్దకు వచ్చాడు. గతంలో జరిగిన హత్యకు సంబంధించి కక్షల నేపథ్యంలో హతుడు ప్రశాంత్ బాపట్లలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ప్రత్యర్థులు నెల్లూరు నుండి కారులో వచ్చి బాపట్ల పాత బస్టాండ్ ఎస్‌బిఐ ఏటిఎం ఎదురు రోడ్డుపై కత్తితో పొడిచి ప్రశాంత్‌ను హతమార్చి వెళ్లినట్లు తెలిసింది. బాపట్ల ఏరియా వైద్యశాల్లో పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుర్గంధం వెదజల్లుతున్న చికెన్ వ్యర్థాలు

రహదారి పక్కన వ్యర్థాలతో దుర్గంధం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు బస్టాండ్ సెంటర్ సమీపంలో అద్దంకి, నార్కెట్‌పల్లి జాతీయ రహదారి ప్రక్కనే ఆనుకొని గ్రామంలోని చికెన్ షాపుల వ్యర్థాలు, హోటల్స్ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు పడేస్తున్నారు. దీంతో అటువైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు దుర్వాసన భరించలేక అల్లాడిపోతున్నారు. గ్రామంలోని వ్యర్థాలన్నీ డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా రహదారికి పక్కనే పడేస్తున్నారు. దుర్గంధం తోపాటు అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు, సర్పంచి ఉండి కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా రహదారికి ప్రక్కన పడేసిన వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. గ్రామంలో వీధుల వెంట బ్లీచింగ్ చల్లాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరుతున్నారు.

లారీని ఢీ కొన్న కారు

డ్రైవర్‌తో సహ ముగ్గురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

ప్రమాదంలో ధ్వంసమైన కారు

అతి వేగంతో కారు నడుపుతూ నియంత్రించలేక లారీ ఢీకొన్న ఘటనలో కారు పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్తోపాటు ఇరువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండలంలోని చిన్న కొత్తపల్లి డొంక వద్ద ఈ ప్రమాద ఘటన గురువారం జరిగింది. హైదరాబాదు నుండి నెల్లూరుకు వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. డ్రైవర్ ప్రసాద్, మంజుల, నీతిష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు 108కి సమాచారం అందించడంతో ప్రథమ చికిత్స అనంతరం స్వగ్రామానికి బయలుదేరి వెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలశెట్టిని పరామర్శిస్తున్న ఏలూరి సాంబశివరావు

తిరుమలశెట్టికి ఏలూరి పరామర్శ

ప్రజాశక్తి - కారంచేడు

అస్వస్థకు గురై గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న టిడిపి మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీహరిని శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని ఎంఎల్ఎ ఏలూరి అన్నారు.

టిడిపి నాయకులను పరామర్శిస్తున్న కందుల

టిడిపి నాయకులకు కందుల పరామర్శ

ప్రజాశక్తి - కొనకనమిట్ల

మార్కాపురం సమీపంలో కారు టైరు పగిలి చెట్టును ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన టిడిపి మండల అధ్యక్షుడు మోరబోయిన బాబూరావు, పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్యను మాజీ ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇరువురికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. దగ్గరుండి వైద్య సేవలను పర్యవేక్షించారు. అనుకోకుండా జరిగిన ప్రమాదం నుంచి బయటపడ్డ టిడిపి నాయకుల కుటుంబాలను ఆయన గురువారం పరామర్శించారు. అధైర్య పడాల్సిన పనిలేదని అన్నారు. త్వరలోనే కోలుకుంటారని చెప్పారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రయాణ సమయంలో వాహనాలను పరిశీలించుకోవాలని టిడిపి కార్యకర్తలకు సూచించారు.

కాలుష్యపు కోరల్లో లంక గ్రామాలు

- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మట్టిగోతులతో పొంచిఉన్న ప్రమాదం

బట్టిలో ఇటుకలు పేరుస్తున్న కూలీలు

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలంలో కొనసాగుతున్న ఇటుక పరిశ్రమతో లంక గ్రామాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకొన్నాయి. గాజులంక, పెదలంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, పోతరులంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, కిష్కింద పాలెం గ్రామాల పరిధిలో గత కొన్నేళ్లుగా పంట భూములను త్రవ్వి ఇటికలు తయారు చేస్తున్నారు. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూముల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేయటంతో ప్రస్తుతం ఆయా గ్రామాల్లో కూలీలకు పరిశ్రమపై ఉపాధి మెండుగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో పండించడానికి పంట పొలాలు లేక కూలి కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ఇటుక తయారీకి వినియోగించే మట్టిని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక లోతుతో పెద్ద పెద్ద కుంటలు పెట్టి తవ్వటం వలన వరదల సమయంలో ఈ గుంటల్లో వరద నీరు చేరి లంక గ్రామాల ప్రజలకు తీవ్ర ప్రమాదాలు జరిగే పరిస్థితులు లేకపోలేదు. ఇటుక బట్టిలు వేసి దానిలో వినియోగించే బొగ్గుతో వెలువడే పొగ ద్వారా కాలుష్యం నెలకొందని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ నెల నుండి మే నెల వరకు ఇక్కడ ఇటుక తయారు చేసే సమయంలో పూర్తిగా వేసవి కాలం కావడంతో బట్టీల పగతో పాటు వాహనాల రాకపోకలతో తీవ్రంగా దుమ్ము, ధూళి లేచి ప్రజలను తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక తయారీకి పంట పొలాలను ఆరడుగులకు మించి లోతు మట్టి తవ్వటానికి వీలులేదని అధికారులు నిబంధనలు విధించారు. అయినప్పటికీ దానిని బట్టి యజమానులు బేకాతర చేస్తూ సుమారు 9నుండి పది అడుగుల లోతు వరకు మట్టి తవ్వుతున్నారు. దీనివలన సమీపంలో రహదారులు సైతం భవిష్యత్తులో కోతకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది.

మామూళ్ల మత్తులో అధికారులు

ఇటుకు తయారీ పరిశ్రమ, దానిలో పనిచేసే కూలీల వేతనాలు, సౌకర్యాలు తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన మైనింగ్, రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిశ్రమలో పనిచేయటానికి అధిక శాతం ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను వలస తీసుకువచ్చి నెలలు తరబడి వారితో పని చేయించుకుని వారికి ఎంతో కొంత ముట్ట చెప్పి కార్మిక శ్రమ దోపిడి చేస్తుంటారనే ఆరోపణలు లేకపోలేదు. ఇక్కడ పనిచేసే కార్మికులకు కనీస వసతులు ఉండవు. మహిళలు స్నానం చేయడానికి, బహిర్భూమికి వెళ్లడానికి అవసరమైన మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాట్లు చేయాల్సిన యజమానులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వీటన్నిటి దృష్ట్యా సంబంధిత అధికారులు దృష్టి సారించి భవిష్యత్తులో ఇటుక పరిశ్రమ వలన పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుచున్నారు.

సుమారు పది అడుగులలోతు తవ్విన మట్టి గొయ్య

ముందుకు కదలని మురుగు!

- ఐదేళ్లయినా పూర్తికాని మురుగు కాలువల నిర్మాణం
- ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయ లోపం
- ప్రజలకు తప్పని అవస్థలు

వర్షానికి పట్టణ నడిబొడ్డున నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - వేటపాలెం

పట్టణంలో మురుగు నీటి పారుదల కాల్వల నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఎక్కడెక్కడ కాలువ చప్టాలు నిర్మించాలి, పైపులైన అవసరం ఉందా లేదా అంటూ ప్రాంతాలను గుర్తించారు. 2019 ఎన్నికల అనంతరం అంచనాలు వేశారు. మూడు కిలోమీటర్ల పైగా కాలువలు నిర్మించాలని, ఏడు వంతెనలు కట్టాలని అధికారులు ప్రతిపాదించారు. అనుకున్నదే తడవుగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.3కోట్లు కేటాయించారు. యుద్ధ ప్రాతిపదికన పనులను మొదలుపెట్టారు. వేటపాలెం రైల్వే స్టేషన్ నుండి పోలీస్ స్టేషన్ మీదుగా గర్ల్స్ హైస్కూల్ నుండి పంచాయతీ కార్యాలయం, అక్కడ నుండి బిబిహెచ్ జూనియర్ కాలేజీ మీదుగా చిన్న బజార్ సెంటర్, గొల్లపూడి వారి వీధి, మసీదు సెంటర్, వేటపాలెం రైల్వే స్టేషన్ మీదుగా వెంకటేశ్వర స్వామి గుడి రోడ్డు, మార్కెట్ రోడ్డు వరకు మార్జిన్ కొలతలు వేశారు. ఆక్రమణల తొలగింపుకు గుర్తులు వేశారు. ప్రజా వ్యతిరేకతను సైతం లెక్కచేయకుండా కాలువలు తవ్వారు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ వరకు నూతనంగా కాలువ నిర్మాణాలు చేపట్టారు. అంతే అక్కడ నుండి రాజకీయం మారిపోయింది. వేటపాలెం గ్రామానికి దుర్గంధం ఆవరించింది. తీసిన కాలువ గుంతలు పూడ్చారు. సంవత్సరాల తరబడి నిల్వ ఉన్న మురుగునీటికి చెత్తాచెదారం తోడై దుర్గంధం వెదజల్లుతుంది. దానికి తోడు ఈగలు, దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. 2019లో 9 నెలల కాలంలో ఒకటిన్నర కిలోమీటర్లు నిర్మించిన మురుగు కాలువలు ఆ తర్వాత ముందుకు కదల్లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమన్వయ లోపంతో పట్టణం మొత్తం మురుగు నీటి పారుదల సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కాలువల నిర్మాణానికి తీసిన గుంతలు నేటికీ సజీవ సాక్షాలుగా నిలిచాయి. కొంత మంది గృహస్తులు చేసేదేమీ లేక తమ ఇంటిలోకి రాకపోకలు కొనసాగించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే కొంత మంది పక్క కట్టడాలు కట్టుకుంటున్నారు. విచిత్రం ఏమిటంటే సంవత్సరం క్రితం మురుగునీటి కాల్వలు నిర్మాణం ఆలస్యం అవుతుందని ఇంకుడు గుంటలు ఏర్పాటు చేశారు. ఇంకుడు గుంట ప్రక్కనే మురుగు నీరు నిలిచిపోయి దుర్గంధం వేదజల్లుతుంది. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల ఆరోగ్యం పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదు. ఇళ్ల ముందు మురుగు చూపరులకు అసహ్యం కలిగిస్తుంది. అయినా సరే ఆ దారి గుండా వెళ్లాల్సిందే. అసహ్యించుకోవాల్సిందే. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు శాపనార్థాలు పెట్టాల్సిందే. ఒకటిన్నర కిలోమీటర్లు డ్రైను నిర్మించిన కాంట్రాక్టర్‌కు నిధులు సైతం చెల్లించారు. అనుకున్న పనిని పూర్తి చేయకుండా డబ్బులు ఎలా చెల్లించారనేది మిస్టరీగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకొని వేటపాలెం పట్టణంలో తిష్ట వేసిన మురుగునీటిని తొలగించేందుకు కాలువల ఆధునీకరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లల్లోకి వెళ్లాలంటే ఈ చెక్క వంతెనలే దిక్కు

19న గంగవరంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని గంగవరంలోని గంగవరం ప్రాంత ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న ఆదివారం రెగ్యులర్ మెడికల్ క్యాంపు జరుగుతుందని వేదిక కన్వీనర్ కరి బాలచంద్రం తెలిపారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. బిపి, షుగరు ఉన్నవారికి తినక ముందు, తిన్న తర్వాత రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని అన్నారు. రు.200లకే రెండు నెలలకు సరిపడా మందులు అందజేస్తారని అన్నారు. శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ అన్నంరాజు సాంబయ్య, డాక్టర్ ఈశ్వరరావు వైద్య సేవలు అందజేస్తారని తెలిపారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, మంచాల అనంతలక్ష్మి స్మారకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో మెడికల్ క్యాంపు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మాజీ ఎంపిటిసి చల్లగాలి శ్రీనివాసులు మృతి

ప్రజాశక్తి - మర్రిపూడి

మాజీ ఎంపీటీసీ చల్లాగాలి శ్రీనివాసులు

మండలంలోని గుండ్లసముద్రం గ్రామ టిడిపి నాయకులు, మాజీ ఎంపీటీసీ చల్లాగాలి శ్రీనివాసులు ఈరోజు తెల్లవారు జామున అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ సందర్భంగా మర్రిపూడి ఎంపీపీ వెంకటరెడ్డి, పొదిలి మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, టిడిపి నాయకులు, కార్యకర్తలు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు

టిడిపి కూటమిదే విజయం

ప్రజాశక్తి - బాపట్ల

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించి స్వీప్ చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు చెప్పారు. పట్టణంలోని ఆయన కార్యాల యంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. ఎన్నికల్లో టిడిపి శ్రేణులపై వైసీపీ నాయకులు అమానుషంగా దాడి చేశారని అన్నారు. టీడీపీకి ప్రజలు మొగ్గుచూ పటంతో వైసిపికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. టిడిపి విజయాన్ని జీర్ణించుకోలేని వైసీపీ శ్రేణులు దాడులను ప్రోత్సహి స్తున్నారని అన్నారు. భౌతిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పొత్తులో భాగంగా జనసేన శ్రేణులు పూర్తిస్థాయిలో తమ ఓటింగును కూటమి అభ్యర్థులకు మళ్లించారని అన్నారు. బాపట్లలో జరిగిన ఘర్షణలపై ఎన్నికల కమిషన్‌కు, పోలీసు పరిశీలకు ఫిర్యాదు చేశామని అన్నారు. పల్నాడు జిల్లా పసుమర్రు సమీపంలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాం ప్రాంతానికి చెందిన మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. త్వరలోనే బాపట్లలో జిల్లా స్థాయి టిడిపి కార్యాలయం ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలో టిడిపి కూటమికి ఓట్లు వేసిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఒటిపితో రూ.1.38 లక్షలు స్వాహా

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలంలోని దోనే పూడి గ్రామా నికి చెందిన కళ్యాణ్ అనే యువకుడు ఇటీవల తన ఫోను కు పౌచు ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకు న్నాడు. రోజులు గడిచినా పౌచ్ రాకపోవడంతో బుధ వారం ఓ గుర్తు తెలియ ని ఫోన్ నెంబర్ నుండి మీకు పౌచ్ అందలేదని, మీరు పంపించిన అమౌంటు తిరిగి వెనక్కు పంపిస్తామని, మీ ఫోనుకు ఒక ఓటిపి వస్తుందని, ఆ ఓటీపీని చెబితే మీ నగదు తిరిగి పంపిస్తామని ఫోన్ చేశారు. దీంతో కళ్యాణ్ తన ఫోనుకు వచ్చిన ఓటీపీని చెప్పగా దాని నుండి కళ్యాణ్ అకౌంట్లో ఉన్న రూ.1,38,500 నగదును స్వాహా చేసినట్లు బాధితుడు కళ్యాణ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

కారు డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అద్దంకి

స్నేహితుని కలిసేందుకు హైదరాబాదు నుండి ఒంగోలుకు వస్తున్న సమయంలో కారు అతి వేగాన్ని నియంత్రించలేక రోడ్డు పక్కన ఉన్న దిమ్మెలను ఢీ కొనడంతో గాల్లో పల్టీలు కొట్టి కారు నడుపుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చక్రాయపాలెం గ్రామ సమీపంలోని మూలములుపు వద్ద అద్దంకి, నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన భాను శరత్ శర్మ తీవ్ర గాయాలు కావడంతో 108 సమాచారంతో ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

'డెంగ్యూ'పై అవగాహన కల్పించండి

- సమర్ధ సమాజ భాగస్వామ్యంతో వ్యాధి నివారణ
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో డెంగ్యూ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సమర్థ వంతమైన సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారించాలని సూచించారు. ప్రతి ఏటా మే 16న దేశ వ్యాప్తంగా జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాలలోని మంచినీటి ట్యాంకులను శుభ్రపరచి ఫ్రైడేను డ్రై డేగా సమర్ధవంతంగా నిర్వహించాలని డిపిఒను ఆదేశించారు. దర్శి పరిసర ప్రాంతాలలో ఈ సంవత్సరం డెంగ్యూ కేసులు అధికంగా నమోదు కావటంతో కారణాలు కనుగొని నివారణ చర్యలను చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా కలిసి పనిచేయాలన్నారు. వెక్టార్ కంట్రోల్ యాప్ పెండింగ్ లేకుండా చూడాలని డిఎం,హెచ్ఒ డాక్టర్ సురేష్ కుమార్‌కు సూచించారు. సమావేశంలో జడ్పీ సిఇఒ, డిపిఒ, వైద్య, విధాన పరిషత్, వైద్య, ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ పీడీ వసుంధర, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఇ మర్దన్ ఆలీ, డిఇఒ సుభద్ర, ఇండస్ట్రీస్ మేనేజర్, జెడి ఫిషరీస్ జెడి చంద్రశేఖర్ రెడ్డి, మైన్స్ డిడి జగన్నాధరావు, సోషల్, బిసి , ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి

- ఆర్‌సిహెచ్ పోర్టల్ అప్‌లోడ్ చేయాలి
- అధికారులకు డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్ ఆదేశం

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రతి ఆరోగ్య కార్యకర్త గర్భిణీల వివరాలను నమోదు చేసి ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ అధికారులను ఆదేవించారు. స్థానిక డిఎం హెచ్ఒ ఛాంబర్‌లో గురువారం జిల్లాలోని పట్టణ ఆరోగ్యకేంద్రాలలో పనిచేస్తున్న అన్ని కేడర్ల సమీక్ష సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో ఆర్‌సిహెచ్, ఛైల్డ్ హెల్త్, ఇమ్యునైజేషన్, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు కేటాయించిన లక్ష్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గర్భిణీ ప్రసవం, ప్రసవానంతరం అందించవలసిన సేవల వివరాలను ను వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి గర్భిణీకి ఎంసిపి కార్డ్ ను అందజేసి అన్ని వివరాలను నమోదు చేసి సంబంధిత వైద్య అధికారిచే ధృవీకరించాలన్నారు. ఈ సేవలన్నింటిని సంబంధిత సూపర్‌వైజర్లు పర్యవేక్షించి తగిన సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష ధోరణి వహించినా, కేటాయించిన లక్ష్యాలను సాధించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఒంగోలు ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాధవీలత, డిపిఎంఒ డాక్టర్ వాణిశ్రీ, డిపిహెచ్ఎన్ఒ సుగుణమ్మ, డిపిఒ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పికెట్ విధులలో నిర్లక్ష్యం వద్దు..: ఎస్పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్‌లను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆ ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అవాంఛనీయ ఘటనలకు, ఘర్షణలకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యలు గురించి, తదనంతర పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరూ కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచిస్తున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల రోజు, తదనంతర పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. ఆ ప్రాంతాలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు రక్షణగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. పికెట్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆ ప్రాంతంలోని పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే వారి గురించి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛనీయ ఘటనలకు ఎవరైనా పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

వర్షాలకు రహదారులు జలమయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా భట్టిప్రోలు, ఐలవరం, వెల్లటూరు తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు లోతట్టుగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికి రహదారులపై మోకాలి లోతు నీరు నిలబడి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిలో భాగంగా గురువారం కురిసిన వర్షానికి భట్టిప్రోలు గ్రామ పంచాయతీ, కూరగాయల మార్కెట్, పాత ఆంధ్ర బ్యాంకు సమీపంలో రహదారిపై నీరు నిలబడి వాహనాల రద్దీతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా ఈ గ్రామాలలో మురుగునీటిపారుదల సౌకర్యం సక్రమంగా లేకపోవడం వల్ల ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాలు ఇదే రీతిలో కొనసాగితే రహదారులు మరింత దుర్భరంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి వర్షపు నీరు నిల్వ లేకుండా బయటకు తరలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రవికి మంత్రి నాగార్జున పరామర్శ

ప్రజాశక్తి-వేమూరు

రవిని పరామర్శిస్తున్న మంత్రి నాగార్జున

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల రోజున జనసేన నాయకుల దాడిలో గాయపడిన వైసిపి నాయకుడు కూచిపూడి రవిని గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున రవి నివాస గహంలో కలిసి పరామర్శించారు. జరిగిన ఘటన సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి-జనసేన ఉమ్మడి కూటమి ఎన్నికల్లో ఓటమిపాలవుతుందని భయంతోనే రవిపై జనసేన కార్యకర్తలు దాడి చేశారని నాగార్జున పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గంలో వైసిపి ఎగురుతుందని, అశోక్‌బాబు ఎమ్మెల్యేగా గెలవబోతున్నట్లు నాగార్జున పేర్కొన్నారు. రవికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వై.పాలెంలో నువ్వా..నేనా.?

- భారీగా పెరిగిన పోలింగ్ శాతం
- అభ్యర్థుల్లో గుబులు..
- ఎవరి లెక్కల్లో వారు..
- ఇదీ యర్రగొండపాలెం నియోజకవర్గం తీరూతెన్నూ..



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో పోలింగ్ ముగిసింది. సార్వత్రిక ఎన్నికల సమరంలో పాల్గొన్న అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఇక అంచనాలు మొదలయ్యాయి. ఎవరి లెక్కల్లో వారు పడ్డారు. ఫలానా చోట వెనుకబడ్డామని, మరోచోట క్రాస్ ఓటింగ్ జరిగిందంటూ వస్తున్న సమాచారం ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ఇది ఎవరికి చేటు చేస్తోంది.. ఎవరికి వరంగా మారుతుందోనన్న అంచనాలు అందక అభ్యర్థులు, వారి అనుచరులు తలలు పట్టుకుంటున్నారు. నువ్వా..నేనా అనే స్థాయిలో ప్రధాన పార్టీల మధ్య పోరు జరిగింది. నియోజకవర్గంలో 2,07,214 మంది ఓటర్లు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 1,85,250 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 89.40 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోపక్క భారీగా పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారిందోనని ఆసక్తి నెలకొంది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఎవరికి అనుకూలంగా ఉంది.. గెలుపు అవకాశాలు ఎవరికి ఉంటాయి.. పెరిగిన ఓటర్లు దేనికి సంకేతం.. ఇవే అంశాలు యర్రగొండపాలెం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.

ప్రలోభాలు పని చేసినా..?

ఈ ఎన్నికల్లో సహజంగా ఉన్న ఓటు బ్యాంకుతో పాటు ఒక్కో పార్టీ ఒక్కో తరహా ఓటర్లపై ఆశలు పెట్టింది. మహిళలు, వృద్ధులు, రైతులతో పాటు ప్రభుత్వ వ్యతిరేకతపై టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆశలు పెంచుకున్నారు. నవరత్నాలు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై వైసిపి అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నమ్మకం పెట్టుకున్నారు. వీటికి ప్రలోభాలు అదనపు మద్దతుగా మారాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరూ భారీగా ఓట్లు కొనుగోలు చేశారు. ఈ తరుణంలో ఎవరికి వారు తమ గెలుపునే ప్రధానంగా తీసుకోవడంతో ఎన్నికల ముందు రోజు సరళి మారింది.

గత ఎన్నికలతో పోలిస్తే..

గత ఎన్నికలు నేర్పిన అనుభవాల దృష్ట్యా ఈసారి పకడ్బందీగా పనిచేసినట్లు ప్రధాన పార్టీల నాయకులు చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో టిడిపికు భారీగా గండి పడ్డ త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లోనూ టిడిపి, వైసిపి మధ్య హోరా హోరీ పోలింగ్ జరిగినట్లు అంచనా. గత ఎన్నికల్లో యర్రగొండపాలెం మండలంలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. ఈసారి ప్రభుత్వంపై ఉన్న నెగెటివ్ ఓటింగ్‌ను తమకు అనుకూలంగా మలచుకోవడంతోనూ, ఓటర్లను పోలింగ్ కేంద్రాల వరకు రప్పించడంలోనూ టిడిపి విజయం సాధించింది. గత ఎన్నికల్లో టిడిపి, వైసిపి మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. ఈసారి కాంగ్రెస్ పార్టీ రావడంతో ఓట్ల చీలిక అనివార్యమైంది. నియోజకవర్గం మొత్తం మీద తమకు వచ్చే ఓట్లపై ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

భారీగా పెరిగిన పోలింగ్ శాతం..

గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈసారి భారీ పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో 87.23 శాతం పోలింగ్ జరగ్గా ఈసారి 89.40 శాతానికి చేరింది. పెరిగిన ఓటింగ్ శాతంలో యువ ఓటర్లు, మహిళలే కీలకపాత్ర పోషించారు. ఎన్నడూ లేని విధంగా చదువుకునే యువతీయువకులు ఓటేసేందుకు ఆసక్తి చూపి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. వీరితో పాటు మహిళలు సైతం ఉదయం నుంచే ఓటేసేందుకు క్యూలైన్లకు చేరారు. ఈ ప్రభావం ప్రధాన పార్టీలు తమకే అనుకూలంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ఎవరు గెలిచినా రెండు వేలలోపు మెజార్టీతోనే గెలుస్తామని చెబుతున్నారు. మరి ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారో వేచి చూడాల్సిందే..